## దటీజ్ తెలంగాణ

పేదలకు వివిధ పథకాలు- రేషన్‌లో సన్నబియ్యం, ఉచిత వైద్యం, ప్రభుత్వ దవాఖానల ఏర్పాటు, సీఎం ఆర్‌ఎఫ్ సాయం తెలంగాణలో సాధ్యం.

గ్యాస్ సిలిండర్, నిత్యావసరాల ధరల పెంపు, జీఎస్టీ పేరుతో దోపిడీ పీఎం కేర్ నిధి నుంచి వేల కోట్లు మాయం మోదీ నిర్వాకం.

సంక్షేమం



తెలంగాణ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన వృద్ధ కళాకారులకు కేసీఆర్ ప్రభుత్వం నెలకు రూ. 3,016 చొప్పున ఆర్థిక సాయాన్ని అందిస్తున్నది. హైదరాబాద్‌లో 11 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో 'తెలంగాణ కళాభవన్' నిర్మించాలని నిర్ణయించింది.

వృద్ధ కళాకారులకు ఆసరా

## మనమే నెంబర్ 1



# పుట్ల కొద్దీ ధాన్యం..


**తినడానికి** సరిపడా పంట పండితే చాలు అనుకొన్న తెలంగాణ.. ఇప్పుడు దేశానికి అన్నం పెట్టే స్థాయిలో ధాన్యాన్ని ఉత్పత్తి చేస్తున్నది. ఒకప్పుడు ధాన్యం కొనుగోళ్లలో 14వ స్థానంలో ఉన్న రాష్ట్రం.. ఇప్పుడు దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. 2014లో 68 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా ప్రస్తుతం 2.6 కోట్ల టన్నులకు చేరింది. దేశవ్యాప్తంగా చూస్తే రాష్ట్ర వాటా 14 శాతంగా ఉన్నది. 2014-15లో వరి సాగు రెండు సీజన్లలో కేవలం 34.98 లక్షల ఎకరాల్లో జరిగితే, 2022-23లో ఏకంగా 1.21 కోట్ల ఎకరాలకు పెరిగింది. రైతులు పండిస్తున్న ప్రతి గింజకూ మద్దతు ధర చెల్లిస్తూ ప్రభుత్వమే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేస్తున్నది.

- తొమ్మిదిన్నరేండ్లలో ధాన్యం ఉత్పత్తిలో మార్పు..

| 2014 | 2023 |
| --- | --- |
| 68 లక్షల టన్నులు | 2.6 కోట్ల టన్నులు |

**పెరుగుదల: 282 శాతం**

*విశేషం: వ్యవసాయానికి 24 గంటలపాటు ఉచిత విద్యుత్తు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణనే. ఇందు కోసం ప్రభుత్వం ఏటా రూ. 5 వేల కోట్లు భరిస్తున్నది. 2014లో రాష్ట్రంలో 68 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా.. కేసీఆర్ సర్కారు ఫ్రీ కరెంటు నిర్ణయం, ప్రాజెక్టుల నిర్మాణంతో ఇప్పుడు ధాన్యం ఉత్పత్తి 2.6 కోట్ల టన్నులకు చేరింది. దేశానికి తెలంగాణ అన్నపూర్ణగా మారింది.*






అన్ని రంగాల్లో దూసుకెళ్తున్న మహిళలను పారిశ్రామిక రంగంలోనూ ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌ఎల్‌ఓ) ఇండస్ట్రియల్ పార్క్ విజయవంతంగా నడుస్తున్నది. వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాలకు కూడా ఇక్కడి ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి.
దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళలే పరిశ్రమలు నిర్వహించేలా ఈ పార్క్‌ను తీర్చిదిద్దారు. సుమారు 25 మంది మహిళా పారిశ్రామికవేత్తలు కంపెనీలు ఏర్పాటు చేసి వివిధ వస్తువులను ఉత్పత్తి చేస్తున్నారు.

# మహిళా సారథి ..పారిశ్రామిక వారధి

సుల్తాన్‌పూర్‌లో 50 ఎకరాల్లో మహిళా పారిశ్రామికవాడ

**సంగారెడ్డి** జిల్లా సుల్తాన్‌పూర్‌లో ప్రభుత్వం 2017లో సుమారు 50ఎకరాల్లో ఎఫ్‌ఎల్‌ఓ గ్రీన్ ఇండస్ట్రీస్ పార్క్‌ను ఏర్పాటు చేసింది. గతేడాది మహిళా దినోత్సవం సందర్భంగా మార్చిలో మంత్రి కేటీఆర్ ఈ ఇండస్ట్రియల్ పార్క్‌ను ప్రారంభించారు. ఇందులో మహిళా పారిశ్రామికవేత్తలు 25 తయారీ యూనిట్లను నెలకొల్పారు. 100 శాతం మహిళా పారిశ్రామికవేత్తలే వీటిని నిర్వహిస్తున్నారు. ఎలక్ట్రానిక్స్, ప్యాకేజింగ్, ఫర్నిచర్, జనరల్ ఇంజినీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, మెడికల్ డివైజెస్, జ్యువెలరీ, న్యూట్రాస్యూటికల్స్, ఆటో పార్ట్స్, కెపాసిటర్స్, ప్రీకాస్ట్ బ్లాక్స్, మల్టీ లెవల్ పార్కింగ్ ఎలివేటర్స్, లిఫ్టులు, గార్మెంట్స్, ఎలక్ట్రిక్ ఫ్యాన్‌లు, ఎల్‌ఈడీ లైట్లు తదితర వస్తువులు ఇక్కడ ఉత్పత్తి అవుతున్నాయి. రూ. 250 -300 కోట్ల వరకు పెట్టుబడులు రాగా, 2,000 మంది ఉపాధి పొందుతున్నారు. ఉద్యోగుల్లో సైతం 60 శాతానికిపైగా మహిళలే ఉండటం విశేషం.



- **మహిళలకు చేయూత..**

**బడుగు,** బలహీన వర్గాలు, మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోరిక మేరకు ప్రత్యేకంగా 50 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేసింది. దేశంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన మొదటి ఇండస్ట్రియల్ పార్క్ ఇదే కావడం విశేషం. ఇతర రాష్ట్రాల్లోని పారిశ్రామికవాడల్లో మహిళలకు భూములు కేటాయిస్తున్నప్పటికీ ప్రత్యేకంగా మహిళల కోసమే పారిశ్రామికవాడలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.

- **మరో 100 ఎకరాలకు ఆమోదం..**

**మహిళలకు** 50% ధరలకే భూములు ఇవ్వడంతో పాటు వివిధ పథకాల కింద ప్రోత్సాహకాలు కూడా ప్రభు త్వం అందించింది. ఇండస్ట్రియల్ పార్కులో 34 ప్లాట్లను ఏర్పాటు చేసి భూములను కేటాయించగా, ప్రస్తుతం 25 పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. రెండోదశ ఎఫ్‌ఎల్‌ఓ ఇండస్ట్రియల్ పార్క్ కోసం ప్రభుత్వం వద్ద ప్రతిపాదన ఉన్నది. ఇదివరకే మరో 100 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని మహిళా ప్రతినిధులు కోరగా, మంత్రి కేటీఆర్ ఆమోదం తెలిపారు. త్వరలోనే రెండోదశ మహిళా పారిశ్రామిక పార్క్ కూడా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నది.

... కిశోర్ శుక్లా



### ప్రభుత్వ సహకారం మరువలేనిది

*దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళల కోసం ప్రత్యేకంగా పారిశ్రామికవాడను ఏర్పాటు చేయడం హర్షణీయం. ప్రోత్సాహకాలను ఇస్తూ మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరువలేనిది. సుల్తాన్‌పూర్‌లోని మహిళా పారిశ్రామికవాడలో పరిశ్రమల నిర్వాహకులంతా మహిళలే. పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారు.*

-సుజిత, కోశాధికారి, ఫిక్కీ, ఎఫ్‌ఎల్‌ఓ

**ఎగుమతి అవుతున్న ఉత్పత్తులు ఇవే..**

మహిళా పారిశ్రామికవాడ నుంచి దేశ, విదేశాలకు వివిధ రకాల ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ముఖ్యంగా ప్యాకేజింగ్, ఎల్‌ఈడీ లైట్లు, మెడికల్ డివైజెస్, జ్యువెలరీ, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు ఎక్కువగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. పోల్‌మన్ టెంపరేచర్ ఇండికేటర్స్, మెటర్ పౌడర్, క్రాంప్టన్ ఫ్యాన్లు, డ్యూక్ బిస్కెట్లు జర్మనీ, దక్షిణ కొరియా తదితర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి.

## షహర్ కీ బాత్

### చారిత్రక సంపద పరిరక్షణకు ప్రాధాన్యం

**చారిత్రక** వారసత్వ సంపద పరిరక్షణలో హైదరాబాద్ టాప్‌లో నిలిచింది. చార్మినార్, కుతుబ్ షాహీ టూంబ్స్, గోల్కొండ లాంటి అనేక కట్టడాలు చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. బన్సీలాల్‌పేట, ఉస్మానియా యూనివర్సిటీ, మౌలాలి, బాపూఘాట్ పరిధిలోని శిథిలమైన అనేక మెట్ల బావుల పూడిక తీసి అంతర్జాతీయ పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దింది తెలంగాణ ప్రభుత్వం. మినీ ఇండియాగా పేరు గాంచిన హైదరాబాద్ అన్ని సంస్కృతులు, సంప్రదాయాలు, ఆచారాలకు నెలవుగా ఉన్నది. అన్ని వర్గాలను ఆదరిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజారంజక పాలన అందిస్తున్నారు. ముఖ్యంగా మైనారిటీల పండుగలు రంజాన్, క్రిస్మస్‌కు కానుకలు అందజేయడం హర్షణీయం. ఇమామ్‌లు, మౌల్వీలకు ప్రతినెలా గౌరవ వేతనం ఇస్తూ చేదోడువాదోడుగా నిలుస్తున్నది. పేదింటి ఆడబిడ్డల పెండ్లిళ్ల భారం తగ్గించేందుకు అమలుచేస్తున్న షాదీముబారక్ పథకం మైనారిటీ కుటుంబాల్లో వెలుగులు నింపింది. ఇన్ని పనులు చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నగరవాసులంతా రుణపడి ఉండాలి.



-మీర్జా తాజుద్దీన్
మెహిదీపట్నం

# ముందుకువోదామా.. ఎన్కకా!

**యాదన్న: ఔ రామన్నా.. మల్ల ఎన్నికలచ్చినయ్.. ఏపార్టీకి ఓటేద్దామంటవ్?**

**రామన్న:** ఏపార్టీకేందే ఏసేది? మనల ఎవలు మంచిగ జూస్కుంటున్నరో ఆల్లకే.. నీకు తెల్వందేమున్నదే?

**యాదన్న: ఏమో ఈ తాప వాల్లకేద్దామని అనుకుంటున్నరట గద!**


**రామన్న:** వాల్లకెట్లేత్తరే.. ఏంజేసిన్రనేత్తరు? నాడు ఎట్లుండెనో నీకు ఎర్కలే? ఎంత గోసవడ్డం.. నీల్లుండెనా? పనులుండెనా? రోడ్లుండెనా? సౌలతులుండెనా? ఎవుసం సాగక మనమే పట్నంల కూలికివోతిమి. నీళ్లులేక భూములు పడావువెడితిమి. పోరగాండ్లను సదువులు సదివియ్యలేక దుకాండ్లకు పనికిదోల్తిమి. నాడు పట్నం బోవాలన్నా రోడ్లు సక్కగలేక ఎన్ని కట్టాలువడ్డం. పిల్లగాండ్లకు, అవ్వయ్యకు సక్కగ తిండివెట్టలేక ఎంతేడ్శినం. తెలంగాణ గౌర్మెంటు పున్నెమాని ఇయ్యాల అందరం మంచిగ బతుకుతాన్నం. చేతిల నాలుగు పైసలు కనవడ్తాన్నయ్.

**యాదన్న: 'అదంత కరెక్టేగని.. ఇప్పుడు గదేమున్నది? ఎవలున్నా గివే పనులుజేత్తురు అంటాన్రు గదనే..'**

**రామన్న:** మనింట్లకు ఏమేంగావాల్నో మనకు తెలుస్తదిగని.. పక్కోనికెట్లదెలుస్తదే? ఆలోచన ఉన్నోడు ఎక్కడ ఏంజేత్తె బాగుంటదో.. అజ్జేత్తడు. ఏ ఆలోచన లేనోడు ఏంజేత్తడు? 'ఇక్కడ రైతులకు నీళ్లు గావాలె' అని ఎవలన్న ఆలోచనజేసిన్రా? ఇయ్యాలజూడు.. ఊరూరికి ఎక్కన్నో ఉన్న కాళేశ్వరం నుంచి నీల్లస్తన్నయ్..

**యాదన్న: ఏ.. వానలు గొట్టినా ఇన్ని నీళ్లు ఉండకపోవునా? అంటుండ్రే..**

**రామన్న:** ఉండుగావచ్చుగని, వాటిని నిలుపుడెట్ల? గంగాలం లెక్కున్న శెరువులు తాంబాలాలైనయ్.. తట్టెడు పూడికదీసిన నాథుడే లేడాయె. కట్టలు బలంగ జేసినోడే లేడాయె. కాలువలు సుత కొసెల్ల పారకపాయె. వాగులు, వంకల నీల్లన్నీ చెక్‌డ్యాంల్లేక గోదాట్లకే పాయె. ఇయ్యాలజూడు శెరువులు, కుంటలు మంచిగైనయ్. ఎటుజూడు.. నీల్లతోటి శెర్వులన్నీ సముద్రాలైనయ్. లక్షలువెట్టినా బోర్లు పడని భూముల్ల నీల్లు ఉబికస్తున్నయ్. ఎండకాలంల సుత చెర్వులు అలుగు దుంకుతున్నయ్. వానల కోసం మొగులుదిక్కు చూసే దినాలే పోయినయ్. అసలెవలన్న వానల కోసం ఇన్నిగనం శెట్లు పెంచాలె.. అడవులు బాగుజెయ్యాలె అని ఆలోచించిన్రానే?



**యాదన్న: అవునే నిజమే.. నా శిన్నతనంల నుంచి శెట్లను నరుకుడే జూసినగని కాపాడుడు సూడలే..!**

**రామన్న:** మరియ్యాల సూడు బడి పిలగాండ్లకాన్నుంచి ఆఫీసర్లు, నాయకులు, సినిమా యాక్టర్లు సుత హరిత యజ్ఞం జేస్తున్నరు. కేసీఆర్ ఎవలకేం తక్కువ జేసిండె? రైతులకు రైతుబంధు ఇచ్చి కాపాడుకోవట్టె. 24 గంటలు కరంటియ్యవట్టె. పంటనంత గౌర్మెంటే కొనవట్టె. గూడులేనోళ్లకు డబుల్‌బెడ్రూం ఇండ్లుగట్టిచ్చె. బిడ్డల పెండ్లికి సాయం జెయ్యవట్టె. దిక్కులేని అవ్వలు, అక్కలకు పెద్దదిక్కాయె. ముసలోళ్లకు రెండువేల పింఛినిచ్చుకుంట ఎవ్వలమీద ఆధారపడకుండజేసె. దివ్యాంగులకు పింఛనిచ్చి.. మంచిగ బతికెట్టు జేసె. దళితబంధిచ్చి ఆల్ల జీవితాలను తేటగజేత్తాండు. ఇట్ల జెప్పుకుంటవోతె చెప్పనియి, అడగని పనులు సుత ఎన్నో జేసిండు. మరి అందర్ని మంచిగజూస్కునే నాయకున్ని గెలిపిద్దామా? లేక కుర్చీకోసం కొట్లాడుకునేటోల్లకు ఓటేసి ఆగం జేస్కుందామా? పదేండ్లల్లనే యాభై, అరవై ఏండ్ల అభివృద్ధి జేసిన పార్టీతోని ఉందమా.. అరవై ఏండ్లు పాలించి.. వందేండ్లు ఎన్కకు తీస్కపోయిన పార్టీకేద్దమా? చెప్పునువ్వే?! ఇట్లనే ముందుకు వోదామా? లేకుంటె.. ఏడిదాడనే ఇడిశేసి మళ్ల ఎన్కకువోదమ? ఆలోచించే!'

... రమేశ్ కనపర్తి



## స్టార్టప్‌లకు స్వర్గధామం.. టీ హబ్

హైదరాబాద్ రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఏర్పాటు చేసిన టీ హబ్ 2.0 అంకుర సంస్థలకు వరంలా మారింది. రూ.276 కోట్లతో 5.82 లక్షల చదరపు అడుగుల సువిశాల విస్తీర్ణంలో పది అంతస్తుల్లో నిర్మించిన ఈ టెక్నాలజీ ఇంక్యుబేటర్ సెంటర్ దేశంలోనే అతిపెద్దది. ఇక్కడ దాదాపు రెండు వేల కంపెనీలు కార్యకలాపాలు చేసుకునేలా సౌకర్యాలు కల్పించారు. కంపెనీలు నెలకొల్పాలనుకునే ఔత్సాహికులు, వారికి పెట్టుబడి సాయం అందించే ఇన్వెస్టర్లు, ప్రభుత్వ సంస్థలు, కార్పొరేట్ కంపెనీలను ఒక చోటకు చేర్చడం టీహబ్ ముఖ్య ఉద్దేశం.



మహబూబ్‌నగర్‌లో నిర్మించిన శిల్పారామం

# లక్ష ఎకరాలకు సాగునీరు!

'పాలమూరు-రంగారెడ్డి'తో నెరవేరనున్న రైతన్న కల.. మంత్రి శ్రీనివాస్ గౌడ్ చొరవతో అభివృద్ధి పరుగులు

*తెలంగాణ వచ్చినంక కేసీఆర్ నేతృత్వంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చొరవతో మహబూబ్ నియోజకవర్గంలో సుమారు రూ.9 వేల కోట్లతో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. మన్యంకొండ దేవస్థానం వద్ద తెలంగాణలో తొలి రోప్‌వేను నిర్మిస్తున్నారు. దివిటిపల్లి ఐటీ కారిడార్‌లో రూ.9 వేల కోట్లతో అమరరాజా పరిశ్రమ ఏర్పాటవుతున్నది.*

**2014** వరకు ఎన్నో కష్టాలు అనుభవించారు ఇక్కడి జనం. పాలమూరును అప్పటి పాలకులు దత్తత పేరిట దగా చేశారు. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ సీఎం అయ్యాక పరిస్థితి మారింది. మహబూబ్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు తీసింది. ఇక్కడే మున్సిపాలిటీలో ఉద్యోగం చేస్తూ ఈ బాధలన్నీ కండ్లతో చూసిన ఎమ్మెల్యే, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తూ వచ్చారు.

### పాలమూరులో రోజూ తాగునీళ్లు

మహబూబ్‌నగర్ పట్టణంలో తాగునీటి సమస్య తీరింది. వచ్చిన రెండేండ్లకే మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తాగునీటి ఎద్దడిని తీర్చేశారు. కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ తీసుకురావడంతో రోజూ పుష్కలంగా తాగునీళ్లు సరఫరా అవుతున్నాయి. 2087 ఎకరాల్లో కేసీఆర్ అర్బన్ పార్కు హైలెట్‌గా నిలిచింది. ఈ పార్కులో అనేక సదుపాయాలు కల్పించడంతో టూరిస్టు స్పాట్‌గా మారిం ది. పార్కు పక్కనే ఉన్న జంగల్ సఫారీ ప్రారంభమయ్యింది. పట్టణం నడిబొడ్డున ఉన్న పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా రూపుదిద్దారు. మురుగు నీరు చెరువులోకి వెళ్లకుండా ప్రత్యేక కాల్వల ద్వారా బయటికి పంపిస్తున్నారు. చెరువు మధ్యలో ఐలాండ్, సస్పెన్షన్ బ్రిడ్జి ఆకట్టుకుంటాయి.

### రాష్ట్రంలోనే టాప్‌టెన్ కాలేజీల్లో ఒకటిగా మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీ

మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీ రాష్ట్రంలోనే టాప్ టెన్ కాలేజీల్లో ఒకటిగా గుర్తింపు తెచ్చుకున్నది. ఈ కాలేజీకి అనుబంధంగా ఉన్న జిల్లా దవాఖానలో ఆధునిక వసతులు కల్పించి పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారు. వెయ్యి పడకల టీచింగ్ దవాఖాన నిర్మిస్తున్నారు. నర్సింగ్, ఫిజియోథెరపీ కాలేజీలతోపాటు జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల కూడా మంజూరయ్యింది. పట్టణాన్ని కార్పొరేషన్ చేయాలన్న ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. ఎన్నికలు అయ్యాక కార్పొరేషన్‌గా మారే అవకాశం ఉన్నది.

### ఏరియల్ వ్యూ: మహబూబ్‌నగర్




పాలమూరు వద్ద ఐటీ టవర్

- **శరవేగంగా పారిశ్రామిక, విద్య, వైద్యం..**

పట్టణం సమీపంలోని దివిటిపల్లి గ్రామంలో ఐటీ కారిడార్ ఏర్పాటయ్యింది. ఇక్కడ సుమారు 12 కంపెనీలు కొలువు దీరాయి. ఇందుకోసం 4 వందల ఎకరాల భూమిని సేకరించారు. దీంట్లో లిథియం బ్యాటరీల ఉత్పత్తి సంస్థ అమరరాజా పరిశ్రమ నెలకొల్పుతున్నది. రూ.9 వేల కోట్లతో చేపట్టనున్న ఈ పరిశ్రమ పనులు ప్రారంభమయ్యాయి. ఇది పూర్తయితే సుమారు 10 వేల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. హన్వాడ మండల కేంద్రంలో ఫుడ్ పార్కు నిర్మాణం కోసం 150 ఎకరాల సేకరణ జరిగింది.

- **లక్ష ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా..**

**బీఆర్‌ఎస్** సర్కారు సాగునీటి రంగానికి ప్రాధాన్యమిస్తుండటంతో కొన్నేండ్లుగా భూగర్భ జలాలు పెరగడం, చెరువులు, కుంటలు మత్తడి దుంకడంతో వ్యవసాయం జోరందుకున్నది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద నిర్మిస్తున్న కరివెన, ఉదండాపూర్ రిజర్వాయర్లు నింపితే భూగర్భ జలాలు మరింత ఉబికి వస్తాయి. ఈ ప్రాజెక్టు కింద లక్ష ఎకరాలకు సాగునీరందించాలన్న లక్ష్యంతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హన్వాడ మండలంలోని చెరువును రిజర్వాయర్‌గా మార్చాలని ప్రతిపాదించారు. ఉదండాపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని తరలించే కాల్వల నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించారు. ఈ రిజర్వాయర్ పూర్తయితే పాలమూరులో సాగునీరు పారనున్నది.